నూతన వంగడాల రూపకల్పనపై శిక్షణ పూర్తి



సర్టిఫికెట్స్ అందిస్తున్న శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీలో రెండువారాల పాటు కొనసాగిన జీవ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోని నూతన వంగడాల రూపకల్పనపై ఏర్పాటు చేసిన శిక్షణ శనివారం ముగిసింది. చివరిరోజు ముఖ్య అతిథిగా టీఎస్ కాస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ అహ్మద్ కమల్ పాల్గొని మాట్లాడారు. యువ శాస్త్రవేత్తలు బయోటెక్నాలజీని ఉపయోగించుకొని కొత్త వంగడాలను రూపొందించాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ బ్రీడర్లు చీడ పీడలతో పాటు మారుతున్న వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా నూతన పరిశోధనలు కొనసాగించాలన్నారు. నూతన పద్ధతులు ఉపయోగించి టిష్యూ కల్చర్ రకాలు, వంగడాలు రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో బయోటెక్నాజీకి చాలా డిమాండ్ ఉంటుందని, కాబట్టి పత్తిలో గులాబీరంగు పురుగు తట్టుకునే బి.టి పత్తి , వరిలో అగ్గి తెగులు ,బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు , ఉల్లికోడును తట్టుకునే రకాలపై పరిశోధించాలని సూచించారు. కార్యక్రమంలో డా సి.వి సమీర్‌కుమార్, డైరెక్టర్ శాంతకుమారి, డాక్టర్ సీహెచ్‌బీ అనురాధా, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్రషర్లను తొలగించిన అధికారులు


వట్టినాగులపల్లిలో క్రషర్లను తొలగిస్తున్న అధికారుల బృందం

మణికొండ: అనుమతులు లేకుండా కొనసాగుతున్న క్రషర్లను అధికారులు తొలగించారు. గండిపేట మండల పరిధిలోని కోకాపేట, వట్టినాగులపల్లి, గొలిదొడ్డి, గోపన్‌పల్లి తండా తదితర ప్రాంతాల్లోని క్రషర్లకు ఇప్పటికే మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రాయల్టీ విభాగాల నుంచి నోటీసులు జారీ చేశారు. అయినా వాటిని అలాగే కొనసాగిస్తుండడంతో జిల్లా మైనింగ్ శాఖ ఏడీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటనర్సు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు శనివారం జేసీబీల సహాయంతో వాటిని నేలమట్టం చేశారు. ఇక ముందు ఎలాంటి క్రషర్లకు అనుమతులు ఇవ్వమని, ఉన్న వాటిని దశల వారీగా పూర్తిగా తొలగిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం అధ్యక్షుడికి సన్మానం


మహేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

అత్తాపూర్: భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన రాజేంద్రనగర్ నాయకుడు సేవల మహేందర్‌ను సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. 2005 లో విద్యార్థి పరిషత్‌లో చేరిన ఆయన 2020 లో బీజేవైఎంకు వచ్చారు. ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో యువమోర్చా అసెంబ్లీ కన్వీనర్, అధ్యక్షుడు వినయ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రేమ్ రాజు, పార్లమెంట్ కన్వీనర్ మల్లా రెడ్డి, రాష్ట్ర ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సత్యనారాయణ ముదిరాజ్, యువ మోర్చా రాష్ట్ర మాజీ సెక్రటరీ బొక్క బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కిరణ్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు గోనె శ్రీకాంత్ రెడ్డి, కొంగల నవీన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, మాలింగం గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జోగు రవి, హరికిషన్‌జీ, బీజేపీ డివిజన్ అధ్యక్షులు బాబురావు, విజయ్ కుమార్, నిఖిల్, సామ రాహుల్ రెడ్డి, మగాని శివ, సడల సందీప్ రెడ్డి, అధ్యక్షులు పాండు, మణికంఠ, కిట్టన్న, రాఘవేందర్ రెడ్డి, చరణ్, అంజి, దిలీప్, నిఖిల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్


మహాలక్ష్మి పథకం వివరాలు సేకరిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. 21వ డివిజన్ యానిక్ గార్డెన్ వారు 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను రూ. 3,92,394 చెక్కును శనివారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఆస్తిపన్నును త్వరగా చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ వి.వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జె.వై.భాస్కర్, బిల్ కలెక్టర్ వై.పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బండ్లగూడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 3, 11, 14వ డివిజన్లలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇంటింటికీ వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, వార్డు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మణికొండలో అవిశ్వాసం నెగ్గుతుంది

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గుతుందని అసమ్మతి కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సిలర్లు ఎ.నవీన్‌కుమార్, బి.పద్మారావు, పి.శైలజ, బి.కావ్యశ్రీరాములు, బి.శ్వేతారవికాంత్‌రెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, కె.లక్ష్మీనాగేశ్వర్ రావు, వసంతరావు, వందనానగేశ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో అత్యధిక సభ్యులు ఎజెండాను తిరస్కరించినప్పుడే నైతికంగా చైర్మన్ సభ్యుల విశ్వాసం కోల్పోయారని, ఇకనైనా ఆయన స్వచ్ఛందంగా పదవీ విరమణ చేస్తే బాగుంటుందని వారు సూచించారు. పార్టీలకు అతీతంగా తామంతా కలిసి కట్టుగా కృషి చేసి అవిశ్వాసాన్ని నెగ్గించుకుంటామని పేర్కొన్నారు.

పోస్టుమన్‌పై దాడి

రాజేంద్రనగర్: పోస్టుమన్‌పై ఓ యువకుడు దాడి చేసిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ డాన్‌బాస్కో పోస్టాఫీస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అభ్యుదయనగర్ కాలనీకి చెందిన అల్లుడు మల్లికార్జున్ (26)కు స్పీడ్ పోస్ట్ వచ్చింది. దీంతో పోస్టుమన్ చిరునామాకు వెళ్లి చూడగా ఎవరూ లేకపోవడంతో పోస్టును కార్యాలయంలో భద్రపరిచాడు. మల్లికార్జున్ శుక్రవారం సాయంత్రం కార్యాలయానికి వచ్చి పోస్టును ఇవ్వాలని కోరగా పోస్ట్‌మన్ నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం బయటకు వెళ్లిన మల్లికార్జున్ బండరాయిని తీసుకొచ్చి శ్రీకాంత్ తలపై కొట్టగా తల పగలడంతో పాటు చేయి కూడా ఫ్రాక్చర్ అయ్యింది. వెంటనే స్పందించిన తోటి ఉద్యోగులు మల్లికార్జున్‌ను పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. గాయపడ్డ శ్రీకాంత్‌ను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గగన్‌పహాడ్‌లో కార్మికుడి హత్య

శంషాబాద్: గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో ఓ కార్మికుడు హత్యకు గురయ్యాడు. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన విజయబహదూర్ (50) తన కుటుంబ సభ్యులతో కలిసి 20 ఏళ్లుగా పారిశ్రామిక వాడలోని లియో లామినేటడ్ పరిశ్రమలోనే ఉంటూ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత సెక్యూరిటీ సిబ్బంది ఉండూ గది వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న నిత్యానంద్ అనే సెక్యూరిటీతో మాట్లాడుతుండగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడే ఉన్న మరో ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది చోటు, గుల్లు వంట కోసం కూరగాయాలు కోస్తున్నారు. చోటు, గుల్లు విజయ బహదూర్‌ను పట్టుకుని కత్తితో గొంతులో పొడిచి పరారయ్యారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి విజయబహదూర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాడిఫైడ్ సైలెన్సర్లు బిగిస్తే కఠిన చర్యలు

అబిడ్స్: బుల్లెట్ వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మాడిఫైడ్ సైలెన్సర్లు బిగించిన పలువురి వద్ద సైలెన్సర్లను సీజ్ చేశారు. ఎంవీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి ఫైన్ వేశామన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..ప్రతిరోజూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్పెషల్ డే నిర్వహిస్తున్నామన్నారు. మాడిఫైడ్ సైలెన్సర్లు ఏర్పాటు చేస్తే ఆ వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

దశలవారీగా హామీల అమలు


నార్సింగిలో దరఖాస్తులు, విద్యుత్ బిల్లులు అందిస్తున్న అశోక్‌యాదవ్

మణికొండ: ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను దశలవారీగా నెరవేర్చుతున్నామని ఆ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం ఇంటింటికీ వచ్చిన విద్యుత్ సిబ్బందికి ప్రజలు దరఖాస్తు చేసిన గృహజ్యోతి పథకం ధ్రువీకరణ పత్రాలను అందించారు. పేదలందరికీ వచ్చే నెల నుంచి బిల్లులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ సేవలను రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచిందని, మిగితా పథకాల హామీల అమలుకు శనివారం బడ్జెట్‌లో పూర్తి స్థాయి నిధులను కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో తొమ్మిదో వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్ కుమార్, నాయకులు వినోద్‌కుమార్, ప్రభు కుమార్ పాల్గొన్నారు.

చెరువుల్లోని గుర్రపు డెక్క తొలగింపు


నెక్నాంపూర్ చిన్న చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌తో పాటు నెక్నాంపూర్ చిన్న, పెద్ద చెరువల పరీవాహకంలో ఉన్న గుర్రపు డెక్క తొలగింపు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అలకాపూర్ టౌన్ షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ దోమల బెడదను నివారించాలని కోరుతూ నాలుగు రోజులు క్రితం టౌన్‌షిప్ వాసులు మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి విన్నవించామన్నారు. దీంతో అదనపు కలెక్టర్ ఆదేశాలతో సిబ్బంది చెరువుల్లోని గుర్రపు డెక్క తొలగించడంతో పాటు నీటిలో దోమల గుడ్లు నిల్వ ఉండకుండా రసాయనాలను పిచికారీ చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్ సంక్షేమ సంఘం నాయకులు అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా చిన్న చెరువును దత్తత తీసుకున్న ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తాము గుర్రపు డెక్కను తొలగిస్తున్నామని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు విద్యుత్ ప్రమాదకరంగా మారాయి. ఓ వైపు వేలాడుతున్న వైర్లకు చుట్టూ అల్లుకున్న చెట్ల కొమ్మలు, మరోవైపు వంగిపోయిన స్తంభాలు ఎప్పుడూ పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. అలాగే కరెంట్ వైర్లకు చెట్లు తాకడంతో తరచూ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇండ్లలోని సామగ్రి కాలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


యాదవ మిత్ర కాలనీలో స్తంభానికి అల్లుకున్న చెట్ల కొమ్మలు, వివిధ కేబుల్ వైర్లు

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి

రాయదుర్గం: గోపన్‌పల్లిలో శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని రామ్‌రతన్ ఆర్య సేవా సమితి ప్రతినిధులు కోరారు. గోపన్‌పల్లిలోని సర్వే నంబర్– 21లో మేళ్ల చెరువు అలుగు వరద కాలువను కాపాడి శ్మశానవాటిక చుట్టూరా ప్రహరీగోడ నిర్మించాలని కోరారు.గతంలో ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు ప్రారంభించి నిలిపివేశారని, కొందరు ఈ శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తూ, దాని ముందున్న స్థలంలో వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కవల సోదరుల అదృశ్యం



శంషాబాద్ రూరల్: పాఠశాలకు వెళ్లిన కవల సోదరులు అదృశ్యమైన ఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో నివాసముంటున్న రాకేశ్‌శర్మ, సుమన్‌దేవి దంపతులకు కవలలు అనురాగ్ (12), మనీశ్‌కుమార్ ఉన్నారు. వీరు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. ఈ నెల 8న స్కూల్ నుంచి వీరు చిన్న సైజు లైటింగ్ బల్బులు, వైరును ఇంటికి తీసుకువచ్చారు. మరుసటి రోజు పాఠశాలకు వెళ్లిన వీరిని తల్లిదండ్రులను తీసుకురావాలని ఉపాధ్యాయులు సూచించారు. దీంతో ఈ విషయాన్ని అనురాగ్ ఇంట్లో చెప్పాడు. శనివారం ఇద్దరు కలిసి ఉదయం పాఠశాలకు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరారు. మధ్యాహ్నం వీరి తండ్రి రాకేశ్‌శర్మ ఉపాధ్యాయులను కలిశాడు. అయితే కుమారులు స్కూల్‌కు రాలేదని చెప్పడంతో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

తల్లీకుమారుడి ..

అత్తాపూర్: భర్తతో గొడవలు పడి ఓ మహిళ తన కుమారుడితో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్‌ఐ మహ్మద్ ఆర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సులేమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ అఫ్రోజ్, నౌషిన్ బేగం (38) దంపతులు. వీరికి మహ్మద్ అలీ (1) కుమారుడు ఉన్నాడు. కాగా అఫ్రోజ్ వ్యాపారంలో నష్టపోయి కొన్ని నెలలుగా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన నౌషిన్ బేగం శనివారం తన కుమారుడు మహ్మద్ అలీతో కలిసి వెళ్లిపోయింది.

పరిశోధనకు పేటెంట్ హక్కు


పేంటెంట్ హక్కుపత్రాన్ని చూపిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చరిత్ కుమార్ తన పీహెచ్‌డీలో క్రయోజనిక్ గ్రౌడింగ్ కోసం నిలువుగా అమర్చిన ప్రీ కూలర్ పద్ధతి అన్న అంశంపై చేసిన పరిశోధనకు పేటెంట్ పొందారు. ఈ ఫలితాలతో సుగంధ ద్రవ్యాల ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరుస్తూ వాటి విలువలను జోడిస్తుందని, అలాగే ఆహార ధాన్యాల శుద్ధి చేసేందుకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెంకటరమణ, డీన్ అఫ్ అగ్రికల్చరల్ సీమ, మనోజ్‌కుమార్ డాక్టర్ చరిత్‌కుమార్‌ను అభినందించారు.

విద్యార్థులకు పోషకాహారం పంపిణీ


విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ కన్వీనర్

మణికొండ: మణికొండ వీఆర్‌ఫర్‌యూ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో స్పెషల్ క్లాసులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం శనివారం పోషకాహారం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ నిర్మల్ చంద్ గొలేచ మాట్లాడుతూ విద్యార్థులు సాయంత్రం ఆరు గంటల వరకు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారన్నారు. వారు ఆకలితో అలమటించకుండా ఉండేందుకు వచ్చే నెల 15 వ తేదీ వరకు అల్పాహారం అందిస్తామని, మరికొంత మంది కూడా ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎ. లక్ష్మణ్‌రావు, శ్రీనాథ్, నరోత్తం, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ పాల్గొన్నారు.

గోవర్ధన్ రెడ్డి బర్త్‌డే వేడుకలు


నాయకులతో కలిసి వేడుకలు జరుపుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మంగళారం గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం బంధువులు, స్నేహితుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండక్లళ నాగేందర్ రెడ్డి, పార్టీ నాయకులు ఖలీద్, భాస్కర్ గౌడ వనం మధుసూదన్ రెడ్డి, రవీందర్, రత్నం, శ్రీరాములు, రమాదేవి, సన్‌రైజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూపు గౌస్ బాయ్, బాబాబాయ్, రామకృష్ణా రెడ్డి, కొండక్లళ ప్రభాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్కేటింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన శ్రీరథ్‌రెడ్డి

బండ్లగూడ: ఇంటర్ స్కూల్ స్కేటింగ్ 200 మీటర్లలో బండ్లగూడ జాగీర్ శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి శ్రీరథ్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం అభినందించారు. భౌరంపేట జేఎస్‌టీయూలో స్పీడ్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ ఇంటర్ స్కూల్ స్కేటింగ్ పోటీల్లో ఆయన పాల్గొని ప్రతిభ చూపాడని వారు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ సంజయ్‌యాదవ్

శంషాబాద్: పట్టణంలోని రుద్రాకాలనీలో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ పి. సంజయ్ యాదవ్ శనివారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నేతలు, అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

విద్యార్థినికి అభినందనలు


చైర్మన్ నుంచి స్కాలర్ షిప్ అందుకుంటుంటున్న చంద్రిక

మైలార్‌దేవ్‌పల్లి: ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే క్యాంప్–2024లో సాంస్కృతిక విభాగంలో ఏపీ, టీ డైరెక్టరేట్‌కు ప్రతినిధ్యం వహించిన కాటేదాన్ పాయోనీర్ కాన్సెప్ట్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని కే నిహిత చంద్రికను యాజమాన్యం శనివారం అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థినికి మంచి గౌరవం లభించడంతో పదో తరగతిలో ఉచిత విద్యతో పాటు స్కాలర్ షిప్‌ను అందిస్తున్నామని తెలిపారు.

హెచ్‌సీయూ ప్రొ.వెంకట్‌రావు పదవీ విరమణ సభ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ పి వెంకట్‌రావు పదవీవిరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హెచ్‌సీయూ డాక్టర్ జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయి శర్మలు వెంకట్‌రావును ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, పరిశోధక విద్యార్థులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే లెక్చర్ హాల్‌లో ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించారు.ఇందులో దేశవ్యాప్తంగా పలు ఉన్నత విద్యాసంస్థలకు చెందిన 60 మంది పరిశోధక విద్యార్థులు జీవావరణశాస్త్రం, వ్యవసాయం, ఆరోగ్యం, శ్రేయస్సు, పట్టణీకరణ, గిరిజన అభివృద్ధి, దేశీయ పరిజ్ఞానం, విద్య వంటి విభిన్న రంగాలపై తమ పరిశోధనా అంశాలతో కూడిన ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.